అటుల కానిచో ఒకరు చెప్పినది మరొకరికి అర్థం కాదు. సమర్థులు, అర్హులు ఆంధ్రులు పలువురు కలరు. కంట్రోలు ఆఫీసులు తదితర కీలక కేంద్రాలలో ఆంధ్రులను నియమించడం అవసరం. రాష్ట్ర ప్రభుత్వం వలెనే కేంద్ర రైల్వే బోర్డు ఈ విషయం ప్రకటించడం అవసరం. ప్రాంతీయ నిరుద్యోగం తగ్గించవచ్చు. అంతే అందువలన ఆంధ్రేతరులను నిషేధించమనీ పొరపాటు దృక్పథంగా భావించవలదు.

ఇక తంతి తపాలా శాఖ: దీనిని ఆంధ్ర సర్కిల్‌గా యేర్పాటు చేయడం జరిగింది. ఈ సర్కిలులోని ఉద్యోగులందరూ ఆంధ్రులుగా వుండునట్లు చూడడం అవసరం. ఈవిషయంలో ఆంధ్ర తంతి తపాలా సంఘంవారాందోళన కూడా ప్రారంభించడం ముదావహం. అందుకై తంతితపాలాశాఖ ఒకనిర్ణయం ప్రకటించవలెను.

ఇక సెంట్రల్ ఎక్సైజు, రాబడి పన్ను (ఇన్‌కం టాక్సు) ఆఫీసులున్నవి. వీటి విషయం కూడా సమగ్రంగా ఆలోచించవలసివుంది. ఆంధ్ర ప్రాంతంలో ఆంధ్రులు నియమింపబడునట్లు చూడవలసివుంది.

ఈ సమస్య పూర్తి పరిష్కారం ఒక విశాలాంధ్ర స్టేటులోనే కాగలదన్నది యథార్థం. అందుకు అందరం ఆందోళనచేసి సాధించవలసివుంది.

ఆంధ్రులకు ఆంధ్రప్రాంతాలలో ఉద్యోగాలు లభించగలిగింది ఆంధ్రప్రజలు ఆందోళన చేసినప్పుడే అనేది మరవడానికి వీలులేదు. ఆంధ్ర ప్రజలు ఆందోళన చేయవలెనంటే ప్రజానీకాన్ని ఉద్యోగాలలో నున్న ఆంధ్రులు సహృదయంతోను, సత్ప్రవర్తనతోను, మర్యాదగాను ప్రవర్తించవలసి వుంది. లంచాల బాధ లేకుండా చేయవలసివుంది. ఇంగ్లీషులో మాట్లాడి తప్పించుకొని పోవ ప్రయత్నించకుండా తెలుగులో మాట్లాడి వారి ఇబ్బందులు తమచేతులో నున్నంతవరకూ తీర్చవలసి వుంది. ఈనాడు సర్కారుల నుండి రాయలసీమ వెళ్ళినవారు, సర్కారు రాయలసీమల నుండి తెలంగాణా వెళ్ళినవారు ఆంధ్రజాతికి తెస్తున్న అప్రతిష్ట విశాలాంధ్రోద్యమాన్ని, ఆంధ్ర రాష్ట్రోద్యమాన్ని ఎంత దెబ్బ కొట్టుతున్నదీ గమనించవలసివుంది. ఆంధ్రరాష్ట్రోద్యమానికి ప్రతిఘాతం కల్పించినవారు సర్కారుల నుండి రాయలసీమకు వెళ్ళినవారేనని, తెలంగాణాలో విశాలాంధ్ర సాధించితే యేమవుతుందో అనే భయం కలగటానికి సర్కారు రాయలసీమ నుండి వెళ్ళిన అధికారుల ప్రవర్తనే ననేది యెవరూ కాదనలేరు. అందువల్ల వీరు ఆంధ్రోద్యమం, ప్రజాక్షేమం, ఆదరణ, అలవరచుకొని పూర్వపు దృక్పథం మార్చుకుని నూతన దృక్పథం అవలంబించాలని కోరుతున్నాను. ప్రజలూ ఉద్యోగులూ పరస్పరం అర్థం చేసుకొన్నప్పుడే పరస్పర సహకారంతో అందరి సమస్యలు తీర్చుకోగలుగుతాము.

# కనిపించని శత్రువు

పి. సత్యనారాయణమూర్తి

బారెడు పొద్దెక్కింది. ఎండ కళ్ళల్లో పొడుస్తోంది. మఱ్ఱిచెట్టుకింద పడుకున్న ముష్టాడు కొంచెం కదిలాడు. కళ్ళు చికిలించిచూసి బద్ధకంగా అటుతిరిగి మళ్ళీ పడుకున్నాడు. కాని ఎండ వీపు మాడ్చేస్తోంది. వంటిమీద ఉన్న కాస్త చిరుగులగుడ్డా వీపుమీదకి లాక్కుని కళ్ళు మరీ గట్టిగా మూసుకున్నాడు. ఉత్త నోటినే ఓ మాటు తృప్తిగా చప్పరించి మోకాళ్ళు ఇంకా గుండెలదగ్గరికి లాక్కుని స్థిమితంగా పడుకున్నాడు. కాని వాడికింక నిద్దర పట్టలేదు. అల్లాగే కళ్ళు మూసుకుని ఏదో ఆలోచిస్తున్నాడు.

మళ్ళీ తెల్లారింది ఇవాళ. నిన్నిపాటికి తను ముష్టికి బయల్దేరాడు. సాయంత్రందాకా ఊరంతా తిరుగుతూనే ఉన్నాడు. కాని అదేవిటో ఒక్కడేనా గుప్పెడు బియ్యం వెయ్య

లేదు. అందుకు వాడికి విచారంలేదు. ఒక రోజు అన్నం లేకపోతే మనుష్యులు చావరనే సత్యం వాడు స్వానుభవంవల్ల కనిపెట్టాడింత క్రితమే! అయితే ఊళ్ళో వాళ్ళన్నమాటలే వాడిని బాగా బాధ పెట్టాయి. రోజూలాగే "పోతులాగున్నావు పని చేసుకోలేవూ" అన్నారందరూ. అయితే రోజూ ఏదో కొంత దొరికేది కనుక ఆ సంతోషంలో ఈ మాటలేవీ వాడి మీద పనిచేసేవి కావు. తాత్కాలికంగా బాధ పడినా వెంటనే మర్చిపోయి మర్నాడాయింటి దగ్గరేమామూలుగా "అమ్మా" అని అరిచేవాడు.

కాని నిన్న అల్లాజరగలేదు. ఒక్కడైనా గుప్పెడుబియ్యం వెయ్యలేదు. ఉత్తి చేతుల్తో మర్రిచెట్టు కిందికొచ్చి కూర్చున్నాడు. నిన్న సాయంత్రం స్థిమితంగాకూర్చున్నాక అందరూ అన్నమాటలు జ్ఞాపకానికొచ్చేయి వాడికి. కోపం వచ్చింది. వళ్ళు మండింది. ఉడుకు మోత్తనం వచ్చి ఒక్కమాటేడ్చాడు. ఓదార్చే వాళ్లు లేకపోవడంచేత చప్పునే ఊరుకున్నాడు. నిన్న రాత్రల్లా నిద్రపట్టలేదు. ఇంక ఛస్తే ముష్టెత్త కూడదు అనుకున్నాడు. అయితే తిండి?...

పనేదైనా చేస్తే బాగుండును. అయితే తను చేసే పనేదైనా ఉందా అని ఆలోచించాడు. తలా తోకాలేని ఆలోచనల్తో వాడి తలమండి పోయింది. ఏం పని చేస్తాను నా మొహం! వెధవ పని. ఆసలేపనీ చెయ్యను. అని ఓ నిశ్చయానికొచ్చాడు. "పనేమిటి? పని! అర్థంలేదా మాటకి. ఏపనీ చెయ్యను. నా ఇష్టం. వేస్తారా ముష్టి వేస్తారు. వాళ్ళకే పుణ్యం. పోనీ వెయ్యరూ? నాకేం! అందరూ నరకంలోకే పోతారు. ఆ!" అని గట్టిగా అరిచేసి పడుకున్నాడు. కాని నిద్ర పట్టందే.

. ఆకలి. కడుపులో మండిపోతోంది. లేచి కూర్చున్నాడు. "ఊళ్ళోకెళ్దామా" అనిపించింది మనస్సులో. చా- వెళ్లకూడదు. ఏమైనా సరే ఈ ఊళ్ళో అన్నం తినకూడదనుకున్నాడు. కాని కడుపు కాలిపోతోంది. వాడికేం చెయ్యాలో తోచలేదు. గట్టిగా కడుపుమీద ఓ గుద్దు గుద్ది నెప్పుడుతున్నా సరే లక్ష్యం చెయ్యకుండా కళ్ళు మూసేసుకున్నాడు.

మళ్ళీ ఇప్పుడు మెలుకువ వచ్చింది. తెల్లారడం భయం వెధవాకలి తయారు. కడుపుమండి పోతోంది. అయినా సరే కదలకుండా పట్టుదలతో అలాగే పడుకున్నాడు. ఎండ వీపు మాడ్చేస్తోంది. ఆకలి కడుపు మాడ్చేస్తోంది. కోపం! ఒళ్లు మండుతోంది.

తనకి జ్ఞానం వచ్చినప్పణ్ణించీ చూస్తున్నాడు ఎప్పటికేనా ఈ ఆకలి తగ్గుతుందేమోనని. అబ్బే ఎన్నాళ్లు తిన్నా, ఎంత తిన్నా ఇది తగ్గేలా కనిపించటం లేదు. పోగా రోజురోజుకీ ఎక్కువైపోతున్నట్లుంది. వాడికి "ఆకలి" అంటే ఒళ్లు మండుతోంది. అది కనిపించదు. కాని కనిపిస్తే తందామనుకున్నాడు కసిదీరా. ఏమైనాసరే ఇవాళ లేవకూడదనుకున్నాడు. పళ్లు బిగించి, కళ్లు మరీ గట్టిగా మూసుకుని సర్దుకు పడుకున్నాడు.

కాని కడుపు మండిపోతోంది. ఇంక ఆగలేకపోతున్నాడు. అయిష్టంతో బరువు కళ్లు తెరిచి కడుపు కేసి చూసుకున్నాడు. కాని వాడికది కనిపిస్తేగా? నిజంగా తను తంతానని భయపడి ఈ కడుపాకలి లోపలికి పోయి దాంకుందనుకుని తనలో తానే నవ్వుకున్నాడు. దాని ఇంతోటి ధైర్యం చూస్తే వాడికి జాలేసింది. "పోనీ లేద్దామేవిటి" అనుకున్నాడు వాడు.

కాని జాలితలిస్తే 'ఆకలి' తన్ని మరీ లోకువ కడుతుందని మళ్ళీ లేవకూడదనుకున్నాడు. కాని వీపు దప్పు కాలినట్లు కాలిపోతోంది. లేచికూర్చున్నాడు. వంట్లో ఏం బాగోలేదు. నీరసం విపరీతంగా ఉంది. కడుపులో ఏదో పెద్దమంట.

ఆకలికి లొంగి ముష్టికి బయల్దేరకుండా ఉండలేకపోయాడు. పట్టుదల జ్ఞప్తికివచ్చింది. ఏంచెయ్యలేక కళ్ళలో నీళ్లు తిరిగాయి. గొంతుకలో ఏదో ఉండగట్టుకుపోయింది. తనమీద తనకే కోపంవచ్చింది. లేచి ఒకమాటు ఒళ్లు విరుచుకున్నాడు. నీరసంతో చదికిలబడి మళ్లీ కాసేపటికి లేచి నిలబడ్డాడు. పరాజయం పొందినవాడి ముఖంతో బలవంతంగా ఊరుకేసి నడకసాగించాడు మళ్లీ మామూలుగా ముష్టెత్తడానికి.